
సాక్షి
రంగారెడ్డి
శనివారం । 1 । జూలై । 2023



గ్రామాల అభివృద్ధే ధ్యేయం

గ్రామాల అభివృద్ధికి తెలంగాణ ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. 10లో▸



వేగంగా వచ్చి లారీని ఢీకొట్టి

తమ్మలోనిగూడ గేట్ సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు అక్కడికక్కడే మృతి చెందారు. 10లో▸



మా గ్రామాలను మార్చొద్దు

మాడ్గులనువిభజించి కొత్తగా ఇర్విన్ మండలం ఏర్పాటు చేయడంపై పలు గ్రామాల ప్రజలు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. 10లో▸

కమలం.. నైరాశ్యం!

కర్ణాటక ఫలితాల తర్వాత నిస్తేజం

- నేతల మధ్య కరువైన సమన్వయం
- ఎవరికి వారే యమునాతీరే అన్నట్లు వ్యవహారం
- జిల్లాలో క్రమంగా పడిపోతున్న గ్రాఫ్
- అయోమయంలో పార్టీ శ్రేణులు



సాక్షి, రంగారెడ్డిజిల్లా: కర్ణాటక ఎన్నికల్లో ఘోర పరాజయం.. రాష్ట్ర పార్టీలో చోటు చేసుకుంటున్న తాజా రాజకీయ పరిణామాలు బీజేపీ కేడర్‌ను తీవ్ర నైరాశ్యంలోకి నెట్టేస్తున్నాయి. మరికొద్ది రోజుల్లో సాధారణ ఎన్నికలకు నోటిఫికేషన్ వెలువడనుంది. కీలకమైన ఈ సమయంలో పార్టీ నేతలంతా సమన్వయంతో పని చేసి కేడర్‌లో ఆత్మస్థైర్యం నింపాల్సిందిపోయి.. నోటిఫికేషన్‌కు ముందే ఎవరికివారే అన్నట్లు వ్యవహరిస్తున్నారు. ఎన్నికల వేళ మరింత పటిష్టంగా వికసించాల్సిన కమలం.. సీనియర్ల తీరుతో క్రమంగా వాడిపోతుండటాన్ని కార్యకర్తలు జీర్ణించుకోలేకపోతున్నారు. జిల్లాలోని చేవెళ్ల, షాద్‌నగర్, ఇబ్రహీంపట్నం నియోజకవర్గాల్లో పార్టీ అంతంత మాత్రంగానే ఉంది. ఎల్బీనగర్, మహేశ్వరం, కల్వకుర్తి, రాజేంద్రనగర్, శేరిలింగంపల్లి నియోజకవర్గాల్లో పటిష్టంగా ఉన్నప్పటికీ.. సీనియర్ల మధ్య నెలకొన్న అంతర్గత విబేధాలు వచ్చే ఎన్నికల్లో ఆపార్టీ పుట్టి ముంచే అవకాశం లేకపోలేదు. వారంతా ఒక్కతాటిపైకి వచ్చి..కలిసికట్టుగా పని చేస్తే కానీ..ఆయా నియోజకవర్గాల్లో పార్టీ గట్టెక్కడం కష్టమని స్వయంగా పార్టీ శ్రేణులే అభిప్రాయపడుతున్నాయి.

అయోమయంలో మహేశ్వరం కేడర్..

ఎల్బీనగర్ తర్వాత పార్టీకి గట్టిపట్టున్న మరో నియోజకవర్గం ఏదైనా ఉందంటే అది మహేశ్వరమే. సరూర్‌నగర్, ఆర్కేపురం డివిజన్లతో పాటు, బడంగ్‌పేట్, మీర్‌పేట్, తుక్కుగూడ మున్సిపాలిటీలు సహా మహేశ్వరం రూరల్ ఏరియాల్లో పార్టీ కేడర్ బలంగా ఉంది. బీజేపీకి జిల్లాలో అత్యధిక స్థానిక ప్రజాప్రతినిధులున్న నియోజకవర్గం కూడా ఇదే. నియోజకవర్గం పార్టీ ఇన్‌చార్జి అందెల శ్రీరాములు గత ఎన్నికల్లో ఇక్కడి నుంచి పోటీ చేసి ఓటమి పాలైనా.. 2014 ఎన్నికలతో పోలిస్తే 2018లో ఓటింగ్ శాతాన్ని పెంచగలిగారు. వచ్చే ఎన్నికల్లోనూ మళ్లీ ఇక్కడి నుంచే పోటీ చేయాలని భావిస్తున్నారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఇప్పటికే ఆయన గడపగడపకూ పాదయాత్ర నిర్వహిస్తున్నారు. పార్టీ రూరల్ జిల్లా అధ్యక్షుడు బొక్క నర్సింహారెడ్డి, సీనియర్ నాయకుడు తూళ్ల వీరేందర్‌గౌడ్, సరూర్‌నగర్ కార్పొరేటర్ ఆకుల శ్రీవాణి కూడా టికెట్ ఆశిస్తున్నారు. క్షేత్రస్థాయిలో పార్టీ పటిష్టత కోసం కృషి చేయాల్సిన సీనియర్లు ఎవరికి వారు ఎమ్మెల్యే అభ్యర్థిగా ప్రచారం చేసుకుంటూ కేడర్‌ను అయోమయంలోకి నెట్టేస్తున్నారు.

ఆ మూడు నియోజకవర్గాల్లోనే అదే పరిస్థితి

లక్షకుపైగా ముస్లిం ఓటు బ్యాంకు ఉన్న రాజేంద్రనగర్ నియోజకవర్గంలోనూ బీజేపీ పాగా వేసేందుకు యత్నిస్తోంది. ఇక్కడి నుంచి రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బుక్క వేణుగోపాల్, మైలార్‌దేవులపల్లి కార్పొరేటర్ తోకల శ్రీనివాసరెడ్డి అసెంబ్లీ బరిలో నిలిచేందుకు పోటీపడుతున్నారు. వీరితో పాటు చేవెళ్ల పార్లమెంట్ ఇన్‌చార్జి మల్లారెడ్డి, సీనియర్ నాయకుడు అంజన్‌కుమార్ కూడా ఇదే నియోజకవర్గం నుంచి టికెట్ ఆశిస్తున్నారు. ఐటీ ఉద్యోగులు ఎక్కువగా నివసించే శేరిలింగంపల్లి నియోజకవర్గం నుంచి రవికుమార్ యాదవ్ సహా సీనియర్ నేత గజ్జల యోగానంద్ టికెట్ కోసం పోటీపడుతున్నారు. వీరిలో రవికుమార్ యాదవ్ ఇప్పటికే ఎమ్మెల్యే అభ్యర్థిగా ప్రకటించుకుని ప్రచారం కూడా చేసుకుంటున్నారు. ఇక బీఆర్ఎస్ నుంచి ఇటీవల బీజేపీలో చేరిన మాజీ ఎంపీ బూర నర్సయ్య గౌడ్ ఇబ్రహీంపట్నం నియోజకవర్గం నుంచి అసెంబ్లీకి పోటీ చేయాలని భావిస్తున్నారు. ఇప్పటికే అక్కడ పార్టీని అంటిపెట్టుకుని పని చేస్తున్న సీనియర్ నేతలు కొత్త అశోక్‌గౌడ్, దయానంద్‌గౌడ్, యాచారం ఎంపీపీ కొప్పు సుకన్య భర్త, బీజేపీ దళిత మోర్చ రాష్ట్ర అధ్యక్షుడు కొప్పు బాష కూడా ఇదే నియోజకవర్గం నుంచి పోటీకి సై అంటున్నారు. జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యుడు ఆచారి కల్వకుర్తి నియోజకవర్గంలో అన్నీ తానై వ్యవహరిస్తున్నారు. ఐదు విడతల్లోనూ ఆయన ఇదే నియోజకవర్గం నుంచి పోటీ చేసి ఓటమి పాలయ్యారు. ఆరోసారి అదృష్టాన్ని పరీక్షించుకునేందుకు సిద్ధమవుతున్నారు.

ఎల్బీనగర్‌లో అంతా అభ్యర్థులే..

జిల్లాలోనే బీజేపీకి గట్టి పట్టున్న నియోజకవర్గం ఎల్బీనగర్. గత జీహెచ్ఎంసీ ఎన్నికల్లో ఇక్కడ 11 కార్పొరేటర్ స్థానాలకు 10 స్థానాలు గెలిచింది. ఆ తర్వాత లింగోజిగూడ కార్పొరేటర్ ఆకుల రమేష్ అకాల మరణంతో జరిగిన ఉప ఎన్నికలో ఆ స్థానాన్ని కోల్పోవాల్సి వచ్చింది. ప్రస్తుతం ఇక్కడ మెజార్టీ కార్పొరేటర్లు బీజేపీ సభ్యులే. ఎన్నికల వేళ ఒక్కతాటిపై నిలవాల్సిన కార్పొరేటర్లు ఎవరికి వారే అన్నట్లుగా వ్యవహరిస్తున్నారు. ఈ నియోజకవర్గం నుంచి బీజేపీ తరఫున అసెంబ్లీ ఎన్నికల బరిలో దిగేందుకు అర్బన్ జిల్లా అధ్యక్షుడు సామరంగారెడ్డి సహా చంపాపేట్ కార్పొరేటర్ వంగా మధుసూదన్‌రెడ్డి, మన్సూరాబాద్ కార్పొరేటర్ కొప్పుల ఈశ్వర్‌రెడ్డి పోటీపడుతున్నారు. క్షేత్రస్థాయిలో పార్టీ బలంగా ఉన్నప్పటికీ.. నేతల మధ్య సఖ్యత లేకపోవడం ఆ పార్టీ పాలిట శాపంగా మారింది.

ఎయిర్‌పోర్టు మెట్రోకు క్రేజ్!



పోటీలో అంతర్జాతీయ దిగ్గజ సంస్థలు

- ఈనెల 5న ముగియనున్న బిడ్డింగ్ గడువు
- రాయదుర్గం-ఎయిర్‌పోర్టు మధ్య 11 రైళ్లు
- ఒక్కో రైలుకు 3 కోచ్‌ల చొప్పున 33 కోచ్‌లతో సర్వీసులు
- రెండేళ్లలో పట్టాలెక్కేవిధంగా నిర్మాణం

సాక్షి, సిటీబ్యూరో: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఎయిర్‌పోర్టు మెట్రో ఎక్స్‌ప్రెస్ నిర్మాణానికి అంతర్జాతీయ దిగ్గజ సంస్థలు పోటీపడుతున్నాయి. బిడ్డింగ్ గడువు సమీపిస్తుండడంతో పలు నిర్మాణ సంస్థల నుంచి అనూహ్యమైన స్పందన వస్తోంది. ఇంజనీరింగ్, ప్రొక్యూర్‌మెంట్ అండ్ కన్‌స్ట్రక్షన్ (ఈపీసీ) పద్ధతిలో ఈ ప్రాజెక్టు నిర్మాణం కోసం హైదరాబాద్ ఎయిర్‌పోర్ట్ మెట్రో రైల్ సంస్థ టెండర్లను ఆహ్వానించిన సంగతి తెలిసిందే. రూ.6 వేల కోట్లకు పైగా అంచనా వ్యయంతో చేపట్టనున్న ఈ ప్రాజెక్టును దక్కించుకొనేందుకు అనేక సంస్థలు ఆసక్తి చూపుతున్నాయని, మరో ఐదు రోజులే మిగిలి ఉన్నందున మరిన్ని సంస్థలు బిడ్‌లను దాఖలు చేసే అవకాశం ఉన్నట్లు అధికారులు తెలిపారు. నాగోల్-రాయదుర్గం, ఎల్బీనగర్-మియాపూర్, జేబీఎస్-ఎంజీబీఎస్ కారిడార్‌లలో మెట్రో అందుబాటులోకి వచ్చిన తరువాత హైదరాబాద్ ముఖచిత్రం మారింది. వ్యాపార, వాణిజ్యరంగాలు, రియల్‌ఎస్టేట్ పరుగులు పెట్టాయి. నగరంలో మెట్రో రైలును నిర్మాణ సంస్థలు లాభదాయకమైన ప్రాజెక్టుగా భావిస్తున్నాయి. ఈ క్రమంలోనే ఐటీ, రియల్ రంగాల్లో గణనీయమైన అభివృద్ధిని సాధించిన రాయదుర్గం-శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయ కారిడార్‌ను దక్కించుకొనేందుకు గ్లోబల్ స్థాయిలో పోటీ పెరిగింది. ఇప్పటికే ఎల్అండ్‌టీ, ఆల్‌స్టామ్, సీమెన్స్, టాటా ప్రాజెక్ట్స్, ఐఆర్‌సీఓఎన్, ఆర్‌వీఎన్ఎల్, బీఈఎంఎల్, పీఎస్‌డీఆర్ఓఎల్ రహీ టెక్నాలజీస్ తది తర జాతీయ, అంతర్జాతీయ స్థాయికి చెందిన కంపెనీలు పోటీలో ఉండగా, గడువు ముగిసేనాటికి మరిన్ని సంస్థలు పోటీలో నిలిచే అవకాశం ఉన్నట్లు అధికారులు చెప్పారు.

రెండేళ్లలో పూర్తి...

మరోవైపు ఈ మార్గాన్ని ఎట్టిపరిస్థితుల్లోనూ 2026 నాటికి పూర్తి చేసేవిధంగా హైదరాబాద్ ఎయిర్‌పోర్టు మెట్రో రైల్ కార్యాచరణ చేపట్టింది. తాము విధించిన నిబంధనలు, షరతులకు అనుగుణంగానే నిర్మాణ సంస్థలు తమ బిడ్‌లను దాఖలు చేయాలని గతంలోనే అధికారులు స్పష్టం చేశారు. రాయదుర్గం నుంచి ఎయిర్‌పోర్టు వరకు సుమారు 31 కిలోమీటర్ల దూరంలో అందుబాటులోకి రానున్న ఎయిర్‌పోర్ట్ మెట్రో ఎక్స్‌ప్రెస్ కోసం ఇప్పటి వరకు సర్వే, పెగ్‌మార్కింగ్, అలైన్‌మెంట్ తదితర పనులు పూర్తయ్యాయి. ఈ మార్గంలో 29.3 కిలోమీటర్ల ఎలివేటెడ్ కారిడార్ కాగా, 1.7 కిలోమీటర్ల వరకు భూగర్భమార్గంలో ట్రాక్ నిర్మాణం చేపట్టవలసి ఉంటుంది. ఎయిర్‌పోర్టు టర్మినల్ సమీపంలో ఒక భూగర్భ మెట్రో స్టేషన్‌తో పాటు మొత్తం 9 మెట్రో స్టేషన్‌లు రానున్నాయి. ఈ ప్రాజెక్టు వ్యయంలో హెచ్ఎండీఏ, జీఎమ్మార్ ఎయిర్‌పోర్టు 10 శాతం చొప్పున భరిస్తుండగా, మిగతా మొత్తాన్ని రాష్ట్ర ప్రభుత్వం అందజేయనుంది.

మొదట 11 రైళ్లతో ప్రారంభం..

రాయదుర్గం -ఎయిర్‌పోర్టు మార్గంలో మొదట 11 రైళ్లను ప్రవేశపెట్టనున్నారు. ప్రతిమెట్రోకు 3 కోచ్‌లు ఉంటాయి. మొత్తం 33 కోచ్‌లతో సర్వీసులను అందుబాటులోకి తెస్తారు. ప్రయాణికుల రద్దీ, డిమాండ్‌కు అనుగుణంగా కోచ్‌ల సంఖ్యను పెంచనున్నారు. ప్రస్తుతం ఢిల్లీ ఎయిర్‌పోర్ట్‌మెట్రో 6 కోచ్‌లు, చెన్నై ఎయిర్‌పోర్ట్ మెట్రో 4 కోచ్‌లతో నడుస్తోంది. మొదట్లో రద్దీ సమయంలో ప్రతి 8 నిమిషాలకు ఒకటి, రద్దీ లేని సమయాల్లో ప్రతి 10 నిమిషాలకు ఒక ట్రైన్ చొప్పున నడుపుతారు. తరువాత రద్దీ వేళల్లో ప్రతి 3 నిమిషాలకు ఒకటి, రద్దీ లేని సమయాల్లో ప్రతి 5 నిమిషాలకు ఒకటి చొప్పున నడిపే విధంగా ప్రణాళికలను రూపొందించినట్లు తెలిసింది. నగరం పడమటి వైపు శరవేగంగా అభివృద్ధి చెందుతున్న దృష్ట్యా కేవలం ఎయిర్‌పోర్టు ప్రయాణికులే కాకుండా అన్ని వర్గాల ప్రయాణికులు కూడా ఎయిర్‌పోర్ట్ మెట్రో సేవలను వినియోగించుకొనే అవకాశం ఉంది. దీంతో రైళ్లు, సర్వీసుల సంఖ్య భారీగా పెరగవచ్చునని అధికారులు అంచనా వేస్తున్నారు. ప్రాథమికంగా 9 స్టేషన్‌లను ఖరారు చేసినప్పటికీ ప్రాజెక్టు నిర్మాణ క్రమంలో మరిన్ని స్టేషన్‌లకు కూడా డిమాండ్ నెలకొనే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

పాఠశాలకు పురుగుల బియ్యం పంపిణీ



బస్తాల్లో ముక్కిన బియ్యం

కేశంపేట: పాఠశాల విద్యార్థుల మధ్యాహ్న భోజనం కోసం వచ్చిన బియ్యంలో పురుగులు కనిపించాయి. మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలకు రెండు రోజుల క్రితం సన్న బియ్యం చేరాయి. వీటిలో పురుగులు అధికంగా ఉన్నట్లు నిర్వాహకులు గుర్తించారు. అధికారులు స్పందించి పాఠశాలకు పంపిణీ చేసిన బియ్యాన్ని వెనక్కి తీసుకోని స్వచ్ఛమైన బియ్యం పంపిణీ చేయాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

గ్రూప్-4 అభ్యర్థులకు ప్రత్యేక బస్సులు



ఉష, ఆర్టీసీ డీయం

షాద్‌నగర్: టీఎస్‌పీఎస్సీ నిర్వహిస్తున్న గ్రూప్-4 పరీక్ష రాసే అభ్యర్థుల కోసం ఆర్టీసీ ప్రత్యేక బస్సులు నడిపిస్తున్నట్లు షాద్‌నగర్ డిపో మేనేజర్ ఉష తెలిపారు. శుక్రవారం ఆమె మాట్లాడుతూ.. పరీక్ష రాసే అభ్యర్థుల కోసం శనివారం ఉదయం 5 నుంచి షాద్‌నగర్ డిపో ప్రత్యేక బస్సులు నడిపిస్తున్నట్లు చెప్పారు. అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

అతిథి అధ్యాపకులకు దరఖాస్తుల ఆహ్వానం

కందుకూరు: కందుకూరు, వికారాబాద్ మహాత్మా జ్యోతిబాపూలే తెలంగాణ బీసీ వెల్ఫేర్ రెసిడెన్షియల్ డిగ్రీ కళాశాలల్లో అతిథి అధ్యాపకులుగా పని చేయడానికి అర్హత, ఆసక్తి ఉన్న పురుష, మహిళా అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు డిగ్రీ కళాశాలల ప్రత్యేకాధికారి డా.జంగం విరూపాక్షప్ప శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తెలుగు, ఇంగ్లిష్, పొలిటికల్ సైన్స్, హిస్టరీ, మ్యాథమెటిక్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ, బోటనీ, జువాలజీ, స్టాటిస్టిక్స్, కంప్యూటర్ సైన్స్, కామర్స్, మేనేజ్‌మెంట్, మైక్రోబయాలజీ, బయోకెమిస్ట్రీ, జియాలజీ, ఫిజికల్ డైరెక్టర్, లైబ్రేరియన్ పోస్టులతో పాటు హెల్త్ సూపర్‌వైజర్/స్టాఫ్ నర్సుల నియామకాన్ని చేపట్టనున్నట్లు తెలిపారు. పీహెచ్‌డీ, ఎంఫిల్, నెట్, సెట్/స్లెట్ అర్హత కలిగిన అభ్యర్థులకు ప్రాధాన్యత ఉంటుందన్నారు. ఓపెన్ కేటగిరీ, బీసీ కేటగిరీ అభ్యర్థులు సంబంధిత సబ్జెక్టుల్లో కనీసం 55 శాతం మార్కులు, ఎస్సీ, ఎస్టీ కేటగిరీ అభ్యర్థులు కనీసం 50 శాతం మార్కులు పొంది ఉండాలన్నారు. డిగ్రీ, పీజీ కళాశాలల్లో పని చేసిన అనుభవాన్ని మాత్రమే పరిగణలోకి తీసుకుంటామన్నారు. దరఖాస్తుతో పాటు పీజీ సర్టిఫికెట్స్, పీహెచ్‌డీ, ఎంఫిల్, సర్వీస్ సర్టిఫికెట్లు జతచేయాలన్నారు. కళాశాల, సబ్జెక్ట్ అవసరాలను బట్టి మెరిట్ ఆధారంగా ఇంటర్వ్యూలకు పిలవడం జరుగుతుందన్నారు. అభ్యర్థులు ఈనెల 6లోపు దరఖాస్తులను ఆర్‌సీఓ కార్యాలయం లేదా బీసీ వెల్ఫేర్ డిగ్రీ కళాశాలల్లో అందించవచ్చన్నారు. ఇతవ వివరాలకు 99892 69715 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

పెద్దమ్మతల్లికి బంగారు బోనం



బంజారాహిల్స్/చార్మినార్: సప్త మాతృకల సప్త బంగారు బోనం పూజా కార్యక్రమాల్లో భాగంగా భాగ్యనగర శ్రీ మహంకాళి జాతర బోనాల ఉత్సవాల ఉమ్మడి దేవాలయాల ఊరేగింపు కమిటీ అధ్యక్షుడు ఆలె భాస్కర్‌రాజ్ ఆధ్వర్యంలో మూడో బంగారు బోనాన్ని శుక్రవారం శ్రీ జూబ్లీహిల్స్ పెద్దమ్మతల్లికి సమర్పించారు. జోగిని నిషా క్రాంతి బంగారు బోనంతో ఆలయంలో అమ్మవారికి బోనం సమర్పించారు. నగరంలోని ఏడు అమ్మవారి దేవాలయాలకు ఏడు బంగారు బోనాలతో పాటు పట్టు వస్త్రాలు సమర్పిస్తున్న నిర్వాహకులు ఇప్పటికే మొదటిబోనాన్ని గోల్కొండ జగదాంబ అమ్మవారికి, రెండో బంగారు బోనాన్ని బల్కంపేట ఎల్లమ్మతల్లికి సమర్పించారు. మూడో బంగారు బోనాన్ని గౌలిపుర కోట మైసమ్మ దేవాలయం నుంచి బాజా భజంత్రీలు, పెద్ద ఎత్తున భక్తుల సమక్షంలో బయల్దేరి పెద్దమ్మతల్లికి సమర్పించిమొక్కులు చెల్లించుకున్నారు. భారీగా భక్తులు కార్యక్రమంలో పాల్గొని పెద్దమ్మతల్లిని దర్శించుకున్నారు. బంగారు బోనా న్ని తిలకించిన భక్తులు పులకించిపోయారు.

ఔటర్‌పై నేటి నుంచి
నార్సింగి ఇంటర్‌చేంజ్



సిద్ధమైన నార్సింగి ఇంటర్‌చేంజ్

- రూ.29.50 కోట్లతో నిర్మాణం..
- ఔటర్‌పై ఇది 20వ ఇంటర్‌చేంజ్
- నేడు ప్రారంభించనున్న మంత్రి కేటీఆర్

సాక్షి, సిటీబ్యూరో: ఔటర్ రింగ్ రోడ్డుపై మరో ఇంటర్ చేంజ్ అందుబాటులోకి రానుంది. నార్సింగి వద్ద సుమారు రూ.29.50 కోట్ల వ్యయంతో నిర్మించిన ఇంటర్ చేంజ్‌ను శనివారం మున్సిపల్ శాఖ మంత్రి కేటీఆర్ ప్రారంభించనున్నారు. ఈ ఇంటర్ చేంజ్ వల్ల నార్సింగి, మంచిరేవుల, గండిపేట్ ప్రాంతాలతో పాటు లంగర్ హౌస్, శంకర్‌పల్లి తదితర ప్రాంతాలకు చెందిన ప్రజలకు ఎంతో ప్రయోజనం లభించనుంది. ఔటర్‌పైన రాకపోకలు సాగించే వాహనదారులు నార్సింగి వద్ద ఎక్కేందుకు, దిగేందుకు అనుకూలంగా ర్యాంపులు, రోడ్లను నిర్మించారు. ఈ ఇంటర్‌చేంజ్ వల్ల ప్రయాణికులకు ఎంతో ఊరట లభించనుంది. ప్రస్తుతం శంషాబాద్ వైపు నుంచి వచ్చే వాహనదారులు నార్సింగి వైపు వెళ్లేందుకు అవకాశం లేదు, అక్కడి నుంచి నానక్‌రాంగూడ టోల్‌ప్లాజా వరకు వెళ్లి వెనక్కి తిరిగి రావలసి వస్తుంది. దీంతో కనీస 5 కిలోమీటర్లు అదనంగా ప్రయాణం చేయవలసి ఉంటుంది. శనివారం నుంచి అందుబాటులోకి రానున్న ఈ ఇంటర్‌చేంజ్ వల్ల ఆ ఇబ్బంది తొలగనుంది. అలాగే మొహదీపట్నం నుంచి కోకాపేట్ వైపు వెళ్లే వాహనదారులకు కూడా దీనివల్ల ప్రయాణం సులువవుతుంది. ప్రస్తుతం 158 కిలోమీటర్ల ఔటర్ రింగ్‌రోడ్డు మార్గంలో 19 చోట్ల ఇంటర్ చేంజ్‌లు ఉన్నాయి. నార్సింగితో ఈ సంఖ్య 20కి చేరింది. వీటితో మల్లంపేట్, కోకాపేట్‌ల వద్ద కూడా హెచ్ఎండీఏ ఇంటర్ చేంజ్‌ల నిర్మాణం చేపట్టింది. ప్రస్తుతం ఆ రెండు చోట్ల పనులు కొనసాగుతున్నాయి. ఇవి కూడా పూర్తయితే ఔటర్‌పైన ఇంటర్‌చేంజ్‌ల సంఖ్య 22కు చేరనుంది. భవిష్యత్‌లో వచ్చే డిమాండ్ మేరకు ఔటర్‌మార్గంలో అవసరమైన చోట్ల ఇంటర్‌చేంజ్‌లను ఏర్పాటు చేయనున్నట్లు కమిషనర్ అర్వింద్‌కుమార్ తెలిపారు.

విద్యాభివృద్ధికి ప్రాధాన్యం

- మంత్రి సబితారెడ్డి



విద్యార్థులకు ల్యాప్‌టాప్‌లు అందజేస్తున్న మంత్రి, జెడ్పీచైర్‌పర్సన్ తదితరులు

కందుకూరు: తెలంగాణ బిడ్డలు ప్రపంచంలో ఎక్కడైనా పోటీ పడి విజయం సాధించేలా పాఠశాల స్థాయి నుంచే తీర్చిదిద్దేలా ప్రభుత్వం కృషి చేస్తోందని విద్యాశాఖ మంత్రి సబితారెడ్డి అన్నారు. అమేజాన్ వెబ్ సర్వీసెస్ సంస్థ ఆధ్వర్యంలో ఆధునీకరించిన మండలంలోని నేదునూరు జిల్లా పరిషత్ పాఠశాల, మోడల్ స్కూల్‌ను శుక్రవారం జెడ్పీ చైర్‌పర్సన్ అనితారెడ్డి, సంస్థ ప్రతినిధులతో కలిసి ప్రారంభించారు. అనంతరం మంత్రి విద్యార్థులకు ల్యాప్‌టాప్‌లు, క్రీడా పరికరాలు అందించారు. సత్యసాయి అన్నపూర్ణ ట్రస్ట్ చేయూతతో న్యూట్రీషియన్ ఫుడ్ అందించే కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ ప్రకటించిన విధంగా కేజీ టూ పీజీ ఉచిత విద్య అందించేలా 9 ఏళ్ల కాలంలో వెయ్యి గురుకులాలు, అదే స్థాయిలో జూనియర్ కళాశాలలు, 90 డిగ్రీ కళాశాలలు, 5 పీజీ, రెండు లా కళాశాలలు గురుకులాల్లో ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. విదేశీ విద్యకు రూ.20 లక్షల స్కాలర్‌షిప్ సైతం అందిస్తున్నామన్నారు. మన ఊరు-మన బడి పథకం కింద రూ.7 వేల కోట్లు ఖర్చు చేసి ఆధునీకరిస్తున్నామన్నారు. ఆంగ్ల ప్రసంగాలతో ఆకట్టుకున్న విద్యార్థినులు ప్రణతి, అక్షితను మంత్రి ప్రత్యేకంగా అభినందించారు. జెడ్పీ చైర్‌పర్సన్ తీగల అనితారెడ్డి మాట్లాడుతూ.. బాలికలు ఉన్నత చదువులు చదివేలా తల్లిదండ్రులు చేయూతనందించాలన్నారు. కార్యక్రమంలో అమేజాన్ సంస్థ విదేశీ, స్వదేశీ ప్రతినిధులు సాజీ పీకే, కార్నేలియారాబిన్సన్, ఆదిత్యాచౌదరి, స్థానిక సర్పంచ్ రామకృష్ణారెడ్డి, ఎంపీపీ మంద జ్యోతి, వైస్ ఎంపీపీ శమంత, మార్కెట్ కమిటీ చైర్మన్ ఎస్.సురేందర్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ డి.చంద్రశేఖర్, డీఈఓ సుశీందర్‌రావు, రైతు బంధు అధ్యక్షుడు కృష్ణారాంభూపాల్‌రెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మన్నే జయేందర్, మహిళా అధ్యక్షురాలు ఇందిర తదితరులు పాల్గొన్నారు.

వచ్చే ఎన్నికల్లో మాదే గెలుపు




కేంద్ర ప్రభుత్వ పథకాలను వివరిస్తున్న బీజేపీ నాయకులు

- తమిళనాడు దళితమోర్చా రాష్ట్ర అధ్యక్షుడు టడా పెరియార్‌స్వామి

షాద్‌నగర్‌రూరల్: కేంద్రంలో, రాష్ట్రంలో డబుల్ ఇంజిన్ సర్కార్ అధికారంలోకి రావడం ఖాయమని తమిళనాడు దళితమోర్చా రాష్ట్ర అధ్యక్షుడు టడా పెరియార్‌స్వామి ధీమా వ్యక్తం చేశారు. ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని చించోడ్‌లో శుక్రవారం మహాజన సంపర్క్ అభియాన్‌లో భాగంగా 176,177 బూత్ కమిటీ అధ్యక్షుడు రమేష్, రాజేందర్ ఆధ్వర్యంలో సమావేశాన్ని ఏర్పాటు చేశారు. మోదీ అమలు చేస్తున్న పథకాలను వివరిస్తూ ఇంటింటికీ బీజేపీ కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా పెరియార్‌స్వామి మాట్లాడుతూ..ప్రధానమంత్రి నరేంద్రమోదీ తొమ్మిదేళ్లలో ప్రజాకర్షక పాలన కొనసాగిస్తున్నారని కొనియాడారు.కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అందె బాబయ్య,జిల్లా అధికార ప్రతినిధి కక్కునూరి వెంకటేశ్‌గుప్తా పాల్గొన్నారు.

ఘాటెక్కిన పచ్చిమిర్చి..
ఠారెత్తిస్తున్న టమాటా





చేవెళ్ల మార్కెట్‌లో అమ్మకానికి వచ్చిన టమాటా, పచ్చిమిర్చి

- పచ్చిమిర్చి కిలో రూ.150
- టమాటా కిలో రూ.80-100
- మిగతా కూరగాయలదీ అదే దారి
- కొనలేమంటున్న సామాన్యులు

చేవెళ్ల: కూరగాయల ధరలకు ఒక్కసారిగా రెక్కలు వచ్చాయి. సామాన్యుడికి అందనంటున్నాయి. ప్రస్తుతం మార్కెట్‌లో పచ్చిమిర్చి ధర ఘాటెక్కిస్తుంటే టమాటా అందనంత ఎత్తులోకి చేరింది. సామాన్యులు వామ్మో ఇవేమి ధరలు అంటూ కొనేందుకు జంకుతున్నారు. కిలో కొనేవారు పావుకిలోతో సరిపెడుతున్నారు. జిల్లా నలుమూలల నుంచి రైతులు ఎక్కువగా కూరగాయ పంటలే సాగు చేసి హైదరాబాద్ మార్కెట్‌కు తరలిస్తుంటారు. జిల్లా మొత్తం ఎక్కువగా టమాటా సాగు చేసే రైతుల వద్ద దిగుబడులు లేకపోవడం మార్కెట్‌లో ధరలు పెరగటానికి కారణమని వ్యాపారులు చెబుతున్నారు. కావాల్సిన కూరగాయలు మార్కెట్‌లో అందుబాటులో లేకపోవటంతో బయట నుంచి దిగుమతి చేసుకోవాల్సి వస్తోంది. కిలో రూ.10 నుంచి రూ.20 ఉండే టమాటా ధర ప్రస్తుతం రూ.80 నుంచి రూ.100 పలుకుతోంది. పచ్చిమిర్చి సైతం రెండు రోజులుగా కిలో రూ.150కి ఎగబాకింది. ఇతర కూరగాయల ధరలు సైతం భారీగానే పెరిగాయి.

రెండేళ్లుగా తక్కువ పలికిన టమాటా

రెండేళ్ల నుంచి టమాట రైతులకు కన్నీరే మిగులుస్తూ వస్తోంది. ఏడాది మొత్తంలో కిలో సగటున రూ.20కు మించలేదు. 25 కిలోల బాక్స్ ధర మార్కెట్‌లో ప్రస్తుతం రూ.1,500 నుంచి రూ.2000 పలుకుతోంది. రైతుల వద్ద దిగుబడులు ఉన్న సమయంలో ఈ ధరలు లేవు.. రైతుల వద్ద దిగుబడి లేని సమయంలో మాత్రం చుక్కలు చూపిస్తున్నాయి. దిగుబడి వచ్చే సమయంలో ధర లేక రైతులకు కనీసం రవాణ ఖర్చులు కూడా వచ్చే పరిస్థితి ఉండేది కాదు. పెట్టుబడులు పెట్టి సాగు చేసిన పంటలను పశువులకు మేతగా మార్చిన రైతులు, మార్కెట్‌కు తెచ్చి పారబోసిన సంఘటనలు అనేకం ఉన్నాయి. అలాంటిది ప్రస్తుతం అమాంతం పెరిగిపోయింది.

కనీస ధర పలికినా మేలు



టమాటా ధర ఇప్పుడు చాలా ఎక్కువగా ఉంది. రెండేళ్లుగా పంట సాగు చేసినా ఎలాంటి లాభం లేకపోయింది. ఈ ఏడాది సాగు చేయటానికి వెనకడుగు వేశాను. ప్రస్తుతం మార్కెట్‌లో ధరలు చూస్తే మళ్లీ టమాటా సాగు చేయాలనిపిస్తోంది. ఇంత కాకపోయినా కనీస ధరలు ఉంటే బాగుంటుంది.

– శ్రీనివాస్, రైతు, చేవెళ్ల

హత్యాయత్నం కేసులో నిందితుడికి ఐదేళ్ల జైలు శిక్ష

కొత్తూరు: హత్యాయత్నం కేసులో నిందితుడికి షాద్‌నగర్ కోర్టు ఐదేళ్ల జైలుశిక్ష విధించినట్లు కొత్తూరు ఎస్‌ఐ శంకర్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కొత్తూరు మండలకేంద్రంలో 2021లో తీగాపూర్ గ్రామానికి చెందిన కృష్ణయ్యపై మండలకేంద్రానికి చెందిన రామానుజపురం బాల్‌రాజు కత్తితో దాడికి పాల్పడ్డాడు. ఈ సంఘటనపై బాధితుడి భార్య మాధవి పోలీసులకు ఫిర్యాదు చేయగా విచారణ చేపట్టి కోర్టుకు నివేదించారు. సాక్ష్యాధారాలను పరిశీలించిన కోర్టు నిందితుడికి ఐదేళ్ల జైలు శిక్షతో పాటు ఐదు వేల జరిమానా విధించింది.

కృత్రిమ ఇసుక ఫిల్టర్లపై దాడులు



కేశంపేట: మండల పరిధిలోని చౌలపల్లి గ్రామ శివారులో అక్రమంగా నిర్వహిస్తున్న కృత్రిమ ఇసుక ఫిల్టర్లపై శంషాబాద్ (స్పెషల్ ఆపరేషన్ టీం) ఎస్‌ఓటీ, కేశంపేట పోలీసులు సంయుక్తంగా శుక్రవారం దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో శేఖర్, ఆంజనేయులు, కృష్ణయ్య అక్రమంగా ఏర్పాటు చేసుకున్న కృత్రిమ ఇసుక ఫిల్టర్లను ధ్వంసం చేశారు. నాలుగు జేసీబీలతో పాటు మూడు ట్రాక్టర్ ఇంజన్లు, ట్రాలీలను స్వాధీనం చేసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. కానిస్టేబుల్ శ్రీనివాసులు ఇచ్చిన ఫిర్యాదు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు. దాడుల్లో ఎస్‌ఓటీ కానిస్టేబుల్ నర్సింగ్‌రావు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధే ధ్యేయం

చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య

చేవెళ్ల: గ్రామాల అభివృద్ధికి తెలంగాణ ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. చేవెళ్ల మండలకేంద్రంలో షాబాద్ చౌరస్తా నుంచి అంబేడ్కర్ నగర్ కాలనీ వరకు హెచ్‌ఎండీఏ నిధులు రూ.7లక్షలతో సీసీ రోడ్డు పనులను శుక్రవారం జెడ్పీటీసీ ఎం.మాలతితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రం వచ్చిన తరువాతే గ్రామాలు ఎన్నడూ లేని విధంగా అభివృద్ధి చెందుతున్నాయన్నారు. అప్పటికీ ఇప్పటికీ గ్రామాల్లో జరిగిన పనులను ప్రజలు గుర్తు చేసుకోవాలన్నారు. ప్రజల సమస్యలు తెలిసిన ముఖ్యమంత్రిగా కేసీఆర్ దేశంలో ఎక్కడా లేని సంక్షేమ, అభివృద్ధి పథకాలను ప్రవేశపెట్టి అమలు చేస్తున్నట్లు తెలిపారు. అలాంటి ముఖ్యమంత్రి ఉండటం మనందరి అదృష్టమన్నారు. మూడోసారి రాష్ట్రంలో బీఆర్‌ఎస్ పార్టీదే విజయమని, మళ్లీ ముఖ్యమంత్రిగా మూడోసారి కేసీఆర్ అవుతారని జోస్యం చెప్పారు.



సీసీ రోడ్డు పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కాలె యాదయ్య

కార్యక్రమంలో ఎంపీపీ ఎం.విజయలక్ష్మి, మాజీ ఎంపీపీ ఎం. బాల్‌రాజ్, సర్పంచ్ బి.శైలజ, మార్కెట్‌ కమిటీ చైర్మన్ మిట్ట వెంకటరంగారెడ్డి, ఎంపీటీసీ రాములు, ఉప సర్పంచ్ గంగి యాదయ్య, బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

స్థలం కేటాయించాలి

చేవెళ్ల: మండలకేంద్రంలో అరె సూర్యవంశీయుల సంఘానికి భవనానికి స్థలం కేటాయించాలని అ సంఘం నాయకులు ఎమ్మెల్యే కాలె యాదయ్యను కోరారు. చేవెళ్ల మండలకేంద్రంలో శుక్రవారం ఎమ్మెల్యేను కలిసి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఆ సంఘం మండల అధ్యక్షుడు కటికె రమేశ్, నాయకులు బాలీజీ, చంద్రకాంత్, ప్రవీణ్ తదితరులు ఉన్నారు.

పాఠశాలలో నోట్‌బుక్స్ విక్రయంపై ఆందోళన

మొయినాబాద్: ప్రైవేటు పాఠశాలలో నోట్‌బుక్స్ అమ్మడంతోపాటు తప్పనిసరి కొనాల్సిందే అనడంతో విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళనకు దిగారు. మొయినాబాద్‌లోని శ్రీచైతన్య పాఠశాలలో టెస్ట్ బుక్స్‌తోపాటు నోట్‌బుక్స్‌ను అధిక ధరలకు విక్రయిస్తున్నారని ఆరోపించారు. శుక్రవారం పాఠశాల సమీపంలో టెస్ట్‌బుక్స్, నోట్ బుక్స్ విక్రయిస్తున్నచోట విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఇప్పటికే అధిక ఫీజులు వసూలు చేస్తున్న శ్రీచైతన్య పాఠశాల యాజమాన్యం నోటు బుక్స్ బయట కొనొద్దని.. యాజమాన్యం వద్దనే కొనాలని ఒత్తిడి చేస్తోందని ఆరోపించారు. టెస్ట్ బుక్స్‌కు కూడా అధిక ధరలు వసూలు చేస్తున్నారన్నారు. బుక్‌పై ఉన్న ఎంఆర్‌పీ రేటు కంటే



నోట్‌బుక్స్ విక్రయకేంద్రం ఎదుట తల్లిదండ్రుల ఆందోళన

రూ.30–50 ఎక్కువ వసూలు చేస్తున్నారన్నారు. యూనిఫాంలు, టై, బెల్టు, షూస్ విక్రయిస్తూ వ్యాపారం చేస్తున్నారని దుయ్యబట్టారు. ఇలాంటి పాఠశాలలపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

హార్డ్‌వేర్ దుకాణంలో చోరీ

శంకర్‌పల్లి: హార్డ్‌వేర్ దుకాణంలో చోరీ జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. మండలంలోని దొంతాన్‌పల్లి గేటు వద్ద గల జగదాంబ ఎంటర్ ప్రైజెస్ హార్డ్‌వేర్ దుకాణం యజమాని దలరాం రోజు మాదిరిగానే శుక్రవారం ఉదయం షటర్ తెరిచేందుకు వెళ్లగా తాళాలు పగులగొట్టి ఉన్నాయి. లోపలికి వెళ్లి చూడగా దుకాణంలో సామగ్రి చిందరవందరగా పడి ఉన్నాయి. సీసీ కెమెరాల వైర్లు కట్ చేసి ఉన్నాయి. 149 వైర్ల బండిల్స్, 85ఎంసీబీలు ఎత్తుకెళ్లినట్టు గుర్తించారు. వీటి విలువ సుమారు రూ.3.5లక్షలు ఉంటుందని తెలిపారు. సీసీ కెమెరాల హార్డ్‌డిస్క్ సైతం దొంగలు ఎత్తుకెళ్లారని చెప్పారు. షాపు యజమాని దలరాం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు మోకిల సీఐ నరేష్ తెలిపారు.

తాటి చెట్టుపై నుంచి పడి గీత కార్మికుడి మృతి

కద్లాల్: తాటి చెట్టు పై నుంచి జారిపడి గీత కార్మికుడు మృతి చెందిన సంఘటన మండల పరిధిలోని చరికొండ గ్రామంలో శుక్రవారం ఉదయం చోటు చేసుకుంది. స్థానికులు, ఎస్‌ఐ హరిశంకర్‌గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. చరికొండ గ్రామానికి చెందిన వల్లపుదాసు నర్సింహగౌడ్ (55) కుల వృత్తిలో భాగంగా ఎప్పటిలాగే శుక్రవారం ఉదయం గ్రామ సమీపంలోని వ్యవసాయ పోలంలో కల్లు గీసేందుకు తాటి చెట్టు ఎక్కాడు. ప్రమాదవశాత్తు నడుముకు ఉన్న మోకు జారడంతో, నర్సింహగౌడ్ తాటి చెట్టు పై నుంచి కింద పడి తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు, వెంటనే కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. సంఘటన స్థలానికి చేరుకున్న కుటుంబ సభ్యులు క్షతగాత్రుడిని, చికిత్స నిమిత్తం హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. చికిత్స అందిస్తుండగా నర్సింహగౌడ్ మృతి చెందాడు. మృతుడికి భార్య రాములమ్మ, ఇద్దరు కుమారులు, కూతురు ఉన్నారు. కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.



నర్సింహగౌడ్ (ఫైల్)

వెనుక నుంచి వేగంగా వచ్చి లారీని ఢీకొట్టి..

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు అక్కడికక్కడే దుర్మరణం

యాచారం: నాగార్జునసాగర్–హైదరాబాద్ రహదారిపై తమ్మలోనిగూడ గేట్ సమీపంలో గురువారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు అక్కడికక్కడే మృతి చెందారు. వివరాలు ఇలా ఉన్నాయి. నల్లగొండ జిల్లా దేవరకొండ మండలం గన్యాతండాకు చెందిన నేనావత్ వెంకటేశ్(27), నేనావత్ అనిల్(18) గురువారం రాత్రి స్వగ్రామం నుంచి కారులో నగరానికి బయలుదేరారు. మార్గ మధ్యలో రాత్రి 11 గంటల సమయంలో తమ్మలోనిగూడ–తక్కళ్లపల్లి గేట్ల మధ్యన నాయారా పెంట్రోలు పంపు సమీపంలో రోడ్డుపై నిలిపి ఉంచిన లారీని వెనుక నుంచి ఢీకొట్టారు. ఈ సంఘటనలో కారులో ప్రయాణిస్తున్న ఇదరు తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందారు. లారీని వెనుక నుంచి బలంగా ఢీకొట్టడంతో కారు ముందు భాగం నుజ్జునుజ్జయింది. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు అతికష్టం మీద మృతదేహాలను బయటికి తీశారు. వెంకటేశ్ లిఫ్ట్ ఇంజినీరుగా పనిచేస్తున్నాడు. మృతులిద్దరూ దగ్గరి బంధువులు. అదే రాత్రి ఇద్దరి మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ఇబ్రహీంపట్నం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. లారీ డ్రైవర్ పరారీలో ఉన్నాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



లారీని వెనుక నుంచి ఢీకొట్టిన కారు

చికిత్స పొందుతూ విద్యార్థిని మృతి

ఇబ్రహీంపట్నం రూరల్: బీటెక్‌లో మార్కులు తక్కువ వస్తాయేమోనని డిప్రెషన్‌కులోనై ఓ విద్యార్థిని ఆత్మహత్య చేసుకున్న సంఘటన ఆదిబట్ల పోలీస్ స్టేషన్ పరిధిలో శుక్రవారం చోటు చేసుకుంది. తుర్కయంజాల్ మున్సిపాలిటీ సూరజ్‌నగర్‌లో నివసించే వి.వెంకట్‌రెడ్డి కూతురు సాధన (21) శేరిగూడలోని శ్రీఇందు కళాశాలలో ఇంజనీరింగ్ తృతీయ సంవత్సరం చదువుతోంది. బీటెక్‌లో మార్కులు తక్కువగా వస్తాయేమోనని మనస్తాపానికి గురై ఈ నెల 13న తను అద్దెకు ఉండే ఇంటి రెండో అంతస్తు నుంచి కిందికి దూకి ఆత్మహత్యకు యత్నించింది. తీవ్ర గాయాలైన సాధనను మెరుగైన వైద్యం కోసం నిమ్స్‌లో చికిత్స చేయించారు. పరిస్థితి విషమించడంతో శుక్రవారం ఉదయం మృతి చెందింది. ఆదిబట్ల పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

మా గ్రామాలను మార్చొద్దు

- మాడ్గులలోనే ఉంచండి
- ఆయా గ్రామస్తుల అభ్యంతరాలు

ఆమనగల్లు: మాడ్గుల మండలాన్ని విభజించి నూతనంగా ఇర్విన్ మండలం ఏర్పాటుకు ప్రభుత్వం ప్రాథమిక నోటిఫికేషన్ జారీ చేసిన నేపథ్యంలో పలు గ్రామాల ప్రజలు అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్నారు. తమ గ్రామాలను మాడ్గుల మండలంలోనే కొనసాగించాలని కోరుతున్నారు. తమ గ్రామాల సమస్యలను పరిష్కరించాకే నూతన మండలం ఇర్విన్‌లో కలపాలని చెబుతున్నారు. బ్రాహ్మణపల్లి, కొత్త బ్రాహ్మణపల్లి, సుద్దపల్లి, అన్నెబోయినపల్లి గ్రామాలను మాడ్గుల మండలంలో ఉంచాలని విజ్ఞప్తి చేశారు. పాత బ్రాహ్మణపల్లి గ్రామాన్ని మాడ్గుల మండలంలో ఉంచాలని కోరుతూ సర్పంచ్ పులికంటి లక్ష్మయ్య ఆధ్వర్యంలో కలెక్టర్ కార్యాలయంలో వినతిపత్రం అందించారు. అన్నెబోయినపల్లి గ్రామాన్ని మాడ్గులలో ఉంచాలని కోరుతూ సర్పంచ్ పోలె కళ యాదయ్య, నాయకులు సంజీవరెడ్డి, రాంరెడ్డి, వెంకటయ్య తదితరులు కోరుతున్నారు.అందుగుల వాగుపై బ్రిడ్జి నిర్మించిన తరువాతే తమ గ్రామాన్ని ఇర్విన్‌లో కలపాలని అందుగుల సర్పంచ్ జయలక్ష్మి డిమాండ్ చేశారు. మాడ్గుల మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయం ముందు శుక్రవారం మాడ్గుల మండల పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. మండల విభజన సరిగా చేయడం లేదని, మాడ్గుల మండలంలో 9 రెవెన్యూ గ్రామాలను ఉంచాలని డిమాండ్ చేస్తూ ధర్నా చేశారు. అనంతరం ఎంపీడీఓ రాఘవులుకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో మండల పరిరక్షణ కమిటీ నాయకులు గౌని రమేశ్‌గౌడ్, వెంకటయ్య, తిరుపతి, శ్రీనివాస్‌గౌడ్, లక్ష్మీనారాయణ, కొత్త బ్రాహ్మణపల్లి సర్పంచ్ జోజమ్మ బాల్‌రెడ్డి, ఉపసర్పంచ్ శౌరిలమ్మ, మండల కో ఆప్షన్ సభ్యులు జోజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మాడ్గుల ఎంపీడీఓ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న మండల పరిరక్షణ కమిటీ సభ్యులు

మనస్తాపంతో యువతి ఆత్మహత్య

పెద్దూర్‌తండాలో తీవ్ర ఉద్రిక్తత



ఆందోళన చేస్తున్నవారితో మాట్లాడుతున్న ఏసీపీ కుశాల్కర్

తలకొండపల్లి: తల్లి మందలించిందనే కారణంతో ఓ యువతి ఆత్మహత్యకు పాల్పడింది. తండావాసుల కథనం ప్రకారం.. మండల పరిధిలోని పెద్దూర్‌తండాకు చెందిన నందిని (17) శుక్రవారం అదే తండాకు చెందిన భగ్‌వాన్‌తో ఇంట్లో కనిపించింది. బయటికి వెళ్లి వచ్చిన తల్లి కోమలి ఇద్దరినీ చూసి మందలించింది. అనంతరం పనుల నిమిత్తం బయటికి వెళ్లింది. తల్లి మందలించిందనే మనస్తాపంతో నందిని ఇంట్లో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకుంది. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు, బంధువులు కోపోద్రిక్తులై అబ్బాయి ఇంటి ఎదుట మృతదేహన్ని ఉంచి ఆందోళనకు దిగారు. దీంతో అబ్బాయి కుటుంబ సభ్యులు ఇంట్లో నుంచి పారిపోయారు. ఆందోళనకారులు అబ్బాయి ఇంటికి నిప్పు పెట్టారు. రేకుల ఇల్లును ధ్వంసం చేశారు. ఇంట్లో ఉన్న బట్టలు, తదితర వస్తువులను కాల్చివేశారు. దీంతో తండాలో ఉద్రిక్తత నెలకొంది. పోలీసులు ఫైర్ ఇంజన్‌తో మంటలార్పారు. ఏసీపీ కుశాల్కర్ నేతృత్వంలో పోలీసులు పరిస్థితిని చక్కదిద్దారు.

క్యాసినో ఆడుతున్న ఇద్దరి అరెస్ట్

మీర్‌పేట: ఆన్‌లైన్ గేమింగ్ (క్యాసినో) ఆడుతున్న ఇద్దరిని మహేశ్వరం జోన్ ఎస్‌ఓటీ పోలీసులు దాడి చేసి అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ.2,85,000 విలువైన సొత్తు స్వాధీనం చేసుకున్నారు. ఎస్‌ఐ బద్యానాయక్ కథనం ప్రకారం.. బీఎన్‌రెడ్డినగర్‌కు చెందిన వ్యాపారి ఆకుల శ్రీశైలం (27), తుర్కయంజాల్ సుభాష్‌నగర్ కాలనీకి చెందిన మహేశ్‌గౌడ్ (34) గుట్టుచప్పుడు శుక్రవారం చైతన్యనగర్‌లోని ఓ ఇంట్లో క్యాసినో ఆడుతుండగా సమాచారం అందుకున్న మహేశ్వరం జోన్ ఎస్‌ఓటీ బృందం దాడి చేసి ఇద్దరిని అరెస్ట్ చేశారు. వారి నుంచి రూ.1,05,000 నగదు, బ్యాంకు ఖాతాలోని రూ.1,20,000, సెల్‌ఫోన్‌లను సీజ్ చేసి మీర్‌పేట పోలీస్‌స్టేషన్‌లో అప్పగించారు.



పోలీసుల అదుపులో ఉన్న నిందితులు. చిత్రంలో స్వాధీనం చేసుకున్న నగదు, సెల్‌ఫోన్లు

యువతి అదృశ్యం

నందిగామ: తల్లితో కలిసి భోజనం చేసి ఇంట్లో నిద్రపోయిన ఓ యువతి అర్ధరాత్రి నుంచి కనిపించకుండా పోయిన ఘటన మండల కేంద్రమైన నందిగామలో శుక్రవారం చోటుచేసుకుంది. ఏఎస్సై విష్ణువర్ధన్ రెడ్డి కథనం ప్రకారం.. నందిగామకు చెందిన మంగళి పార్వతమ్మ తన కూతురు శ్వేత(19)తో కలిసి గురువారం రాత్రి భోజనం చేసిన అనంతరం ఇంట్లో నిద్రపోయారు. శుక్రవారం తెల్లవారుజామున నిద్రలోనుంచి లేచి చూసే సరికి శ్వేత కనిపించలేదు. ఆచూకీ కోసం బంధువులు, తెలిసిన వారిని సంప్రదించగా ఎక్కడ ఆచూకీ లభించలేదు. పార్వతమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మరో ఘటనలో యువకుడు..

పశువుల కొట్టానికి వెళ్లిన ఓ యువకుడు అదృశ్యమైన ఘటన మండల పరిధిలోని జంగోనిగూడలో శుక్రవారం వెలుగులోకి వచ్చింది. ఏస్సై విష్ణు వర్ధన్ రెడ్డి కథనం ప్రకారం వివరాలు.. అంతిరెడ్డిగూడ గ్రామానికి చెందిన ఎంబడి లక్ష్మన్‌కు జంగోనిగూడ గ్రామ సమీపంలో వ్యవసాయ భూమి ఉండగా అందులో పశువుల కొట్టం ఉంది. అంతిరెడ్డిగూడ గ్రామానికి చెందిన సంపత్‌రావు తరుణ్ (19) ఎంబడి లక్ష్మణ్ వద్ద రెండేళ్లుగా వ్యవసాయ పనులు చేస్తున్నాడు. ఈ నేపథ్యంలో బుధవారం రాత్రి పశువుల కొట్టం వద్దకు వెళ్లిన సంపత్ రావు తరుణ్ గురువారం తెల్లవారు జామున కనిపించలేదు. ఆచూకీ కోసం వెతకగా ఎక్కడ లభించలేదు. దీంతో లక్ష్మణ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



శ్వేత (ఫైల్)



సంపత్ రావు తరుణ్ (ఫైల్)

లారీడ్రైవర్‌పై యువకుల దాడి

షాద్‌నగర్‌రూరల్: లారీ డ్రైవర్‌పై యువకులు దాడి చేసిన సంఘటన పట్టణ సమీపంలోని హైదరాబాద్ రోడ్డులోగల ఇండియన్ పెట్రోల్ పంపువద్ద ఈ నెల 28న అర్ధరాత్రి చోటు చేసుకుంది. ఏఎస్‌ఐ రాంచందర్ కథనం ప్రకారం .. ఫరూఖ్‌నగర్‌కు చెందిన లారీ డ్రైవర్ మహ్మద్‌గౌస్ పటాన్‌చెరువు దగ్గరలోని పెన్నా రెసిడెన్షియల్ కంపెనీ నుంచి ఐరన్ లోడుతో బెంగళూరుకు వెళ్తుంటాడు. ఈ నేపథ్యంలో మహ్మద్‌గౌస్ ఈ నెల 28న అర్ధరాత్రి సమయంలో ఐరన్‌లోడుతో బెంగళూరు వెళ్తూ పట్టణ సమీపంలోని ఇండియన్ పెట్రోల్ పంపువద్ద లారీని ఆపుకొని నిద్రకు ఉపక్రమించాడు. అదే సమయంలో పట్టణానికి చెందిన అభిలాష్, గణేష్, మనోజ్ అక్కడికి వచ్చారు. ఎవరు మీరు, ఇక్కడ అర్ధరాత్రి సమయంలో ఏం చేస్తున్నారని మహ్మద్‌గౌస్ వారిని అడిగాడు. మమ్మల్ని అడిగేందుకు నువ్వు ఎవడివిరా అంటూ నానా బూతులు తిడుతూ దాడి చేశారు. ఈ దాడిలో మహ్మద్‌గౌస్‌కు గాయాలయ్యాయి. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఏఎస్‌ఐ రాంచందర్ తెలిపారు.



గాయపడిన మహ్మద్‌గౌస్